

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి వెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు
ఎడిటర్
☎ 9440814576

సంపుటి : 04 సంచిక : 171 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు గురువారం, అక్టోబరు 22, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram




ఈ పత్రాలు లేకున్నా నామినేషన్ దాఖలు చేయొచ్చు: ఎస్ఈసీ

నామినేషన్ దాఖలు చేసే సమయంలో కొన్ని పత్రాలు అవసరం లేదు
నామినేషన్లకు ఎన్ఓసీ, నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదు
మిగతా పత్రాలు మాత్రం ఇస్తే చాలని వివరించింది...
ఎన్ఓసీ కోసం నామినేషన్ ఆపొద్దని ఎన్నికల అధికారులను ఆదేశించింది
ఎన్ఓసీ నిబంధన.. స్థానిక సంస్థల ఎన్నికల చట్టంలో లేదని స్పష్టం

అమరావతి: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కీలక విషయం వెల్లడించింది. నామినేషన్ దాఖలు చేసే సమయంలో కొన్ని పత్రాలు అవసరం లేదని ఎస్ఈసీ తెలిపింది. నామినేషన్లకు ఎన్ఓసీ, నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. మిగతా పత్రాలు మాత్రం ఇస్తే చాలని వివరించింది. ఎన్ఓసీ కోసం నామినేషన్ ఆపొద్దని ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఎన్ఓసీ నిబంధన.. స్థానిక సంస్థల ఎన్నికల చట్టంలో లేదని స్పష్టం చేసింది.

కోర్టు తీర్పులను వక్రీకరించేలా..

గొడ్డలిపార్టీ కుట్రలు..!!



లిటిగెంట్లతో అభివృద్ధిని, ఎన్నికలను అడ్డుకోవడమే గొడ్డలిపార్టీ పని

విధ్వంసానికి దిగి.. కోర్టుకు వెళ్లడమనే ఆలోచనలు వారికే వస్తాయని ఎద్దేవా

- **స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం**
- **"కోర్టు తీర్పులను కూడా వక్రీకరించేలా గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది**
- **అనేక విషయాలపై కోర్టుల్లో సుమారు 60 పిటిషన్లు వేశారు**
- **ఆ పార్టీ అధినేత బెంగళూరులో కూర్చొని విధ్వంస రచనలు చేస్తున్నారు**
- **విధ్వంసాలను అడ్డుకుంటే కోర్టులకెళ్లి ఎన్నికలు ఆపేందుకు ప్రయత్నిస్తున్నారు**
- **ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేనివారి ఆలోచనలు ఇలాగే ఉంటాయి**
- **రాజకీయాల్లో జగన్‌లాంటి క్రిమినల్ లిటిగెంట్స్ ఉంటే ప్రమాదకరం**
- **గొడ్డలి పార్టీ అరాచకాలను ప్రజలకు వివరంగా చెప్పాలి : చంద్రబాబు**

అమరావతి: లిటిగెంట్లతో అభివృద్ధిని, ఎన్నికలను అడ్డుకోవడమే గొడ్డలిపార్టీ పని అని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. విధ్వంసానికి దిగి.. కోర్టుకు వెళ్లడమనే ఆలోచనలు వారికే వస్తాయని ఎద్దేవా చేశారు. బుధవారం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ఎన్నికల అభ్యర్థులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు."కోర్టు తీర్పులను కూడా వక్రీకరించేలా గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. అనేక విషయాలపై కోర్టుల్లో సుమారు 60 పిటిషన్లు వేశారు. ఆ పార్టీ అధినేత బెంగళూరులో కూర్చొని విధ్వంస రచనలు చేస్తున్నారు. విధ్వంసాలను అడ్డుకుంటే కోర్టులకెళ్లి ఎన్నికలు ఆపేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేనివారి ఆలోచనలు ఇలాగే ఉంటాయి. రాజకీయాల్లో జగన్‌లాంటి క్రిమినల్ లిటిగెంట్స్ ఉంటే ప్రమాదకరం. గొడ్డలి పార్టీ అరాచకాలను ప్రజలకు వివరంగా చెప్పాలి"అని సీఎం సూచించారు.



పారా ఆసియా క్రీడల్లో...

భారత్ జోరు..!!

ఖాతాలో 54 పతకాలు

జపాన్ వేదికగా జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. తాజాగా పారా అథ్లెట్ సిమ్రాన్ టీ12 విభాగంలో 100 మీటర్ల స్ప్రింట్ ఈవెంట్‌లో స్వర్ణం పతకం సాధించింది. సిమ్రాన్ మంగళవారం జరిగిన 200 మీటర్ల ఈవెంట్‌లోనూ పసిడి పతకం కైవసం చేసుకుంది. దీంతో ఈసారి ఆమె బ్యాక్ టూ బ్యాక్ రెండు స్వర్ణాలు అందుకోవడం విశేషం. మరోవైపు పురుషుల టీ47 విభాగంలో 100 మీటర్ల స్ప్రింట్ పోటీలో భారత అథ్లెట్ దిలీప్ స్వర్ణం గెలుచుకున్నాడు. ఇక పురుషుల 400 మీటర్ల టీ35/38 ఈవెంట్‌లో భారత అథ్లెట్ అకీరా నందన్ బానోతు రజతం సాధించాడు. 51.25 సెకన్లలో రేసును పూర్తి చేసింది రెండో స్థానంలో నిలిచాడు. దీంతో భారత్ ఖాతాలో ఇప్పటివరకు 14 స్వర్ణాలు, 20 రజతాలు, 20 కాంస్య పతకాలు చేరాయి. 54 పతకాలతో భారత్.. పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.



నాసిక్ కుంభమేళా ప్రారంభోత్సవానికి


రాష్ట్రపతి ముర్ము..

మహారాష్ట్ర ప్రత్యేక ఆహ్వానం

మహారాష్ట్ర నాసిక్ త్రయంబకేశ్వర సింహస్థ కుంభమేళా ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నేతృత్వంలోని అధికారుల బృందం అధికారికంగా ఆహ్వానించింది.

రెబల్స్ బరిలో ఉంటే సస్పెన్షన్..

వేటు తప్పదు..!!



రెబల్ అభ్యర్థులతో నామినేషన్లు ఉపసంహరింపజేయాలి

కూటమి నేతలతో సమన్వయంతో వ్యవహరించాలి

- **జనసేన, భాజపా అధికారిక అభ్యర్థులున్న చోట కూడా రెబల్స్ లేకుండా చూడాలి**
- **స్థానిక ఎన్నికల్లోనూ ప్రజల ఆశీర్వాదం పొందాలి**
- **సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ప్రజలకు వివరించాలి**
- **'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**
- **కూటమి పార్టీలతో మిత్రధర్మం పాటిస్తూ క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు సాఫీగా జరగాలి**
- **టికెట్లు దక్కని ఆశావహులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తాం**
- **ప్రజలకు సేవ చేసే మంచి అభ్యర్థులనే ఎంపిక చేయాలి : : చంద్రబాబు హెచ్చరిక**

అమరావతి: స్థానిక ఎన్నికల్లో రెబల్స్ బరిలో ఉంటే పార్టీ నుంచి సస్పెన్షన్ వేటు తప్పదని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు హెచ్చరించారు. స్థానిక ఎన్నికల ప్రచారం, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై పార్టీ ముఖ్యనేతలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రెబల్ అభ్యర్థులతో నామినేషన్లు ఉపసంహరింపజేయాలని దిశానిర్దేశం చేశారు. కూటమి నేతలతో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. జనసేన, భాజపా అధికారిక అభ్యర్థులున్న చోట కూడా రెబల్స్ లేకుండా చూడాలని పార్టీ నేతలను సీఎం ఆదేశించారు. స్థానిక ఎన్నికల్లోనూ ప్రజల ఆశీర్వాదం పొందాలని, సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను

..2వ పేజీలో



నామినేషన్ల గడువు పొడిగింపుపై

పిటిషన్..!!

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- **19 చోట్ల తమను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారు**
- **నామినేషన్ల గడువు మొత్తంగా వాయిదాకు, పొడిగింపునకు నిరాకరించింది**
- **ఫిర్యాదు చేసిన చోటే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలి**
- **సుప్రీంకోర్టు ఆదేశాలపై వైకాపాది తప్పుడు ప్రచారం: తెదేపా**
- **ఫిర్యాదులు అందిన చోటే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం**
- **నామినేషన్లకు అవకాశం కల్పిస్తే జిల్లా కలెక్టర్ వద్ద దాఖలుకు పరిశీలించాలి**
- **వైకాపా నేతలు తీవ్ర హింసకు పాల్పడ్డారు: ఎస్ఈసీ తరఫు న్యాయవాదులు**
- **నామినేషన్ కేంద్రంలో ఉన్న వారిని కారుతో ఢీ కొట్టించిన అంశం కోర్టు దృష్టికి..**
- **వైకాపా అరాచకంతో భద్రత మధ్య ప్రజలను తరలించాల్సి వచ్చింది**
- **శాంతి భద్రతలను పరిరక్షించడంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదు**

దిల్లీ: ఏపీలోని మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు గడువు పొడిగించాలన్న వైకాపా పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 19 చోట్ల తమను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని ఆ పార్టీ తన పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. నామినేషన్ల గడువు మొత్తంగా వాయిదాకు,

..2వ పేజీలో

నామినేషన్ల గడువు పొడిగింపుపై పిటిషన్..!!

(మొదటిపేజీ తరువాయి)

పొడిగింపునకు నిరాకరించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని ఫిర్యాదు చేసిన చోటే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది.

సుప్రీంకోర్టు ఆదేశాలపై వైకాపాది తప్పుడు ప్రచారం: తెదేపా... నామినేషన్లపై ఇప్పటికే ఫిర్యాదులు అందిన చోటే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నామినేషన్లకు అవకాశం కల్పిస్తే జిల్లా కలెక్టర్ వద్ద కూడా దాఖలుకు పరిశీలించాలని, దీనిపై గురువారంలోపు నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీకి సూచించింది. మరోవైపు అభ్యర్థుల తుది జాబితా ప్రకటన గడువును ఈనెల 25 వరకు సుప్రీంకోర్టు పొడిగించింది. కోర్టుల్లో కేసులు వేయడం తప్ప.. ఎక్కడా ఫిర్యాదులు చేయలేదని ఎస్ఈసీ తెలిపింది. తమ ఆదేశాలపై తీసుకున్న చర్యలపై ఈనెల 27న నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

వైకాపా నేతలు తీవ్ర హింసకు పాల్పడ్డారు: ఎస్ఈసీ తరపు న్యాయవాదులు... విచారణ సందర్భంగా వైకాపా ఎంపీలు, నేతలు పలుచోట్ల వ్యవహరించిన తీరును రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నామినేషన్ కేంద్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు చేసిన అరాచకాలను వివరించారు. నామినేషన్ కేంద్రంలో ఉన్న వారిని కారుతో ఢీ కొట్టించిన అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 15, 16వ తేదీల్లో దురుద్దేశంతో తీవ్ర హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారని.. రాజకీయ కుట్రకు తెరలేపారని ఎస్ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తెలిపారు. వైకాపా అరాచకంతో భద్రత మధ్య ప్రజలను తరలించాల్సి వచ్చిందన్నారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ప్రాంతం నుంచి మారణాయుధాలతో దుండగులను వైకాపా దిగుమతి చేసుకుందని.. వారిని పోలీసులు అరెస్ట్ చేశారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పంజాబ్ నుంచి వచ్చిన అంతర్రాష్ట్ర ముఠాల దగ్గర ఆయుధాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. శాంతి భద్రతలను పరిరక్షించడంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదని ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు.

రెబల్స్ బరిలో ఉంటే సస్పెన్షన్ వేటు తప్పదు..!!

(మొదటిపేజీ తరువాయి) నెరవేరుస్తున్నామని ప్రజలకు వివరించాలని చంద్రబాబు సూచించారు. 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కూటమి పార్టీలతో మిత్రధర్మం పాటిస్తూ క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు సాఫీగా జరిగేలా చూడాలని ఆదేశించారు. టికెట్లు దక్కని ఆశావహులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని, ప్రజలకు సేవ చేసే మంచి అభ్యర్థులనే ఎంపిక చేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

ఏపీలో తొలి వందే భారత్ స్లీపర్ రైలుకు
ముహూర్తం ఫిక్స్..

ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్. రాష్ట్రానికి తొలి వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రానుంది. ఈ మేరకు ముహూర్తం కూడా ఖరారు అయింది. నవంబర్ 1న ఈ రైలును ప్రారంభించేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది. బెంగళూరు నుంచి ముంబై వరకు ఈ రైలు వెళ్లనుంది. ఏపీ మీదుగా ప్రయాణం ఉంటుంది.

ఏపీలోని రైలు ప్రయాణికులకు పెద్ద శుభవార్త. ఏపీకి తొలి వందే భారత్ స్లీపర్ రైలు రానుంది. ఈ కొత్త రైలు పట్టాలెక్కేందుకు ముహూర్తం కూడా ఖరారు అయింది. నవంబర్ 1వ తేదీన లాంచనంగా ప్రారంభం కానుంది. బెంగళూరు- ముంబై మధ్య వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభించాలని రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ రైలు బెంగళూరులో బయల్దేరనుండగా.. ఏపీ మీదుగా ముంబైకు వెళ్లనుంది. బెంగళూరు, ముంబై మధ్య వేగవంతమైన, సౌకర్యవంతమైన రాత్రిపూట ప్రయాణాన్ని ఈ రైలు అందించనుంది. ఈ రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణికులు, పర్యాటకులు, విద్యార్థులు ఎక్కువగా పర్యటిస్తూ ఉంటారు. దీంతో వారికి ఇది గొప్ప ప్రయోజనం చేకూర్చనుంది. ఇప్పటికే ఈ రైలు నడిపేందుకు రైల్వేశాఖ ఆమోదం తెలపగా.. ఇప్పుడు నవంబర్ 1 నుంచి పట్టాలెక్కించేందుకు డేట్ ఫిక్స్ అయింది.



ఏపీలోని ఈ స్టేషన్లలో హాల్టింగ్... ఏపీలోని అనంతపురం, గుంతకల్ రైల్వే స్టేషన్లలో ఈ వందే భారత్ స్లీపర్ రైలు ఆగనుంది. మొత్తం 16 అధునాతన కోచ్‌లు ఇందులో ఉంటాయి. ఏసీ త్రీ టైర్, టూ టైర్, ఫస్ట్ ఏసీ క్లాసులు అందుబాటులో ఉంటాయి. ఈ రైలులో మొత్తం ఒకేసారి 823 మంది ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉంది. రాత్రిపూట హాయిగా నిద్రపోతూ ప్రయాణించవచ్చు. ముంబైలో ప్రతీ రోజు రాత్రి 10:30 గంటలకు బయలుదేర్దనున్న ఈ రైలు.. మరుసటి రోజు మధ్యాహ్నం 2:50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరిగు ప్రయాణంలో బెంగళూరు నుండి రాత్రి 10 గంటలకు బయల్దేరి.. మరుసటి రోజు మధ్యాహ్నం 1:50 గంటలకు ముంబైకి చేరుకుంటుంది. ఈ రెండు నగరాల మధ్య ప్రస్తుతం ఉన్న రైళ్లల్లో జర్నీకి 22 గంటల సమయం పడుతుంది. వందే భారత్ స్లీపర్ రైలులో 16 గంటల్లోనే ప్రయాణించే సౌకర్యం అందుబాటులోకి రానుంది.

ఏయే స్టేషన్లలో ఆగుతుందంటే..?... ఈ రైలు అనంతపురం, గుంతకల్లు రైల్వే స్టేషన్లలో ఆగనుండటంతో.. ఏపీలోని ప్రయాణికులకు కూడా వందే భారత్ స్లీపర్ సర్వీసులు అందుబాటులోకి వచ్చినట్లు అయింది. దీని వల్ల రాయలసీమ ప్రాంతం నుండి బెంగళూరు, ముంబైతో పాటు మార్గం మధ్యలో ఉన్న ప్రధాన నగరాలకు ప్రయాణించే వారికి ఉపయోగపడనుంది. ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం స్టేషన్లలో కూడా హాల్ట్ కల్పించాలని డిమాండ్లు ఉన్నప్పటికీ.. రైల్వేశాఖ నుంచి సానుకూల నిర్ణయం రాలేదు. ఈ రైలు సోలాపూర్, పూణే, కళ్యాణ్, రాయచూర్, కలబుర్గి, అనంతపురం, గుంతకల్లు స్టేషన్లలో ఆగనుందని సమాచారం. వారానికి ఆరు రోజులు నడపాలని ప్రతిపాదనలు ఉన్నాయి. దేశంలో తొలి వందే వందే భారత్ స్లీపర్ ట్రైన్‌ను హౌరా-గువహతి మధ్య ప్రారంభించారు. ఇప్పుడు ఇది రెండో ట్రైన్‌గా చెప్పవచ్చు. ఈ సారి దక్షిణాది రాష్ట్రాలకు కూడా వందే భారత్ స్లీపర్ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.

ఏపీలో స్థానిక సంస్థల.. ఎన్నికలకు బ్రేక్

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడింది. ఎన్నికలను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 13 మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు 87 మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిలిపివేసింది. ఈసీ ఆదేశాలతో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసింది. తొలుత కొన్ని స్థానాల్లో నిలిపివేయాలని భావించగా.. ఇప్పుడు అన్ని స్థానాల్లో బ్రేక్ పడింది.



ఏపీ ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ వేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తూ ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. నామినేషన్ల ఉపసంహరణతో పాటు అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను హోల్డ్ చేసింది. దీంతో 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అభ్యర్థుల తుది జాబితా ఈ నెల 25 వరకు వాయిదా వేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. నామినేషన్లు వేయలేకపోయిన అభ్యర్థుల నుంచి వినతులు, ఆధారాలను ఎన్నికల సంఘం పరిశీలించనుంది. అధికారుల నివేదిక తర్వాత రేపు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోనుంది. నామినేషన్ల గడువు పొడిగిస్తే అభ్యర్థులకు కనీసం 48 గంటల సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో ఎన్నికల నోటిఫికేషన్‌ను సవరించేలా ఎస్ఈసీ చర్యలు తీసుకోనుంది. నామినేషన్లు వేయలేకపోయినా అభ్యర్థుల అంశంపై రేపు నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల నుంచి నివేదికలు వచ్చాక నామినేషన్ల గడువు పొడిగించడంపైవ గురువారం ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసే అవకాశముంది. అయితే తదుపరి ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎన్నికల ప్రధానాధికారి అనిల్‌చంద్ర పునేఠా అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ముందుకెళ్తామని తెలిపారు. అటు స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయాలని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై కూటమి నేతలు స్పందించారు. కుట్రలతో ఎన్నికలను అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యమని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలను తొలి రోజు నుంచే అడ్డుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగితేనే 16వ ఆర్థిక సంఘం, కేంద్ర ప్రభుత్వ నిధులు పొందే అవకాశముంటుందని చెబుతున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు తమకు అవకాశం ఇవ్వడం లేదంటూ వైసీపీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో నామినేన్లు దాఖలు చేసేందుకు గడువు పొడిగించాలని పిటిషన్‌లో పేర్కొంది. అలాగే తమ అభ్యర్థులకు భద్రత కల్పించాలని కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. నామినేషన్లు వేయలేకపోయిన అభ్యర్థుల ఫిర్యాదులు, వారు సమర్పించిన ఆధారాలను ఒక్కొక్కటిగా పరిశీలించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో తొలుత ఎస్ఈసీ 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను నిలిపివేసింది. మిగతాచోట్ల ఎన్నికలు యథావిధిగా నిర్వహించాలని తొలుత భావించింది. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాత 100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ వేసింది.

నాసిక్ కుంభమేళా ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ముర్ము..

మహారాష్ట్ర ప్రత్యేక ఆహ్వానం

మహారాష్ట్ర నాసిక్ త్రయంబకేశ్వర సింహస్థ కుంభమేళా ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా రాష్ట్రపతి దౌపది ముర్మును ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నేతృత్వంలోని అధికారుల బృందం అధికారికంగా ఆహ్వానించింది.

మహారాష్ట్రలో వైభవంగా జరిగే సింహస్థ కుంభమేళాను అక్టోబర్ 31న జెండా ఎగురవేసి అధికారికంగా ప్రారంభించాలని రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆహ్వానించారు. కుంభమేళాతో పాటు మహా హారతి, నాసిక్ త్రయంబకేశ్వర్ కుంభ్ మేళా వెబ్‌సైట్ ప్రారంభం, కుంభ్ మేళా నేపథ్య గీతాన్ని ఆవిష్కరించడం, కుంభ్ మేళా ప్రత్యేకతలు తెలిపే కాఫీ టేబుల్ పుస్తకాన్ని ప్రారంభించాల్సిందిగా కోరారు. ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, సునేత్ర పవార్, క్యాబినెట్ మంత్రులతో పాటు పలు ఉన్నాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత, గిరిజన వారసత్వ కళలను ప్రతిబింబించేలా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ముఖ్యమంత్రి ఇచ్చిన బహుమతి ప్రాముఖ్యం సంతరించుకుంది. సింహస్థ కుంభ మేళా నేపథ్యాన్ని తెలిపేలా ఆహ్వాన పత్రికను రూపొందించారు. నాసిక్ ప్రకృతి సౌందర్యాలను వర్ణిస్తూ.. పత్రికను రూపొందించారు. గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేసిన దూప్‌స్టిక్స్, చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారపదార్థాలు, మహువా పువ్వులతో చేసిన ఉత్పత్తులు, వెదురు ఉత్పత్తులు, స్వచ్ఛమైన తేనెతో పాటు.. మహారాష్ట్ర ప్రత్యేకమైన పైఠాని చీరను రాష్ట్రపతికి బహుకరించారు. ఇవి మహారాష్ట్ర సంస్కృతీ సాంప్రదాయాలను, వైవిధ్యతను తెలియజేయడమే కాకుండా.. గిరిజనులకు, కళాకారులకు, చేనేతకారులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రపతికి బహుకరించినట్లు అధికారులు వెల్లడించారు.



సంపాదకీయం

ఎల్ నినో ఎఫెక్ట్..
అక్కడ రూ.100కి చేరిన పాల ధర


మహారాష్ట్రలోని భీవండిలో పాల ధర లీటరుకు రూ.100కి చేరింది. ఎల్ నినో ప్రభావంతో పశుగ్రాసం కొరత, పెరిగిన ఉత్పత్తి వ్యయాలు దీనికి కారణం. అధిక ధరలతో వినియోగదారులు ఆందోళన చెందుతుంటే, రైతులు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

దేశంలో ఎల్ నినో ప్రభావం నిత్యావసర వస్తువులపై తీవ్రంగా పడుతోంది. ఇప్పటికే బియ్యం ధరలు పెరుగుతుండగా, తాజాగా పాల ధరలు కూడా డబుల్ అవుతున్నాయి. మహారాష్ట్రలోని భీవండిలో లీటరు పాల ధర ఏకంగా రూ.100కి చేరడం వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ ముఖ్యమైన పోషకాహారమైన పాలు, సామాన్యులకు భారంగా మారాయి. భీవండి ప్రాంతంలో స్థానిక పాడి రైతులు అమ్మే తాజా పాలు లీటర్‌కు దాదాపు రూ.100కి చేరుకోవడం ప్రజల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ధరల పెరుగుదలపై వినియోగదారులు ఆందోళన చెందుతుండగా, పాడి రైతులు మాత్రం ఈ రూ.100 ధర కూడా తమకు గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. పశువుల మేత, దానా, ఎండుగడ్డి, పశువుల కొనుగోలు ధరలు విపరీతంగా పెరగటమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని భీవండి తాలూకా మిల్క్ ప్రొడ్యూసర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. గత 20-25 రోజుల్లోనే పశువుల దానా ధరలు భారీగా పెరిగాయని రైతులు తెలిపారు. ముఖ్యంగా, ఆయిల్ కేక్ ధర రూ.40 నుంచి రూ.50 వరకు పెరిగింది. ఎండుగడ్డి, వరిగడ్డి, జొన్న, సజ్జ కాడల ధరలు కూడా భారీగా పెరిగాయి. పశువుల కొనుగోలు ధరలు కూడా ఆకాశాన్నంటాయి. ఆవుల రేటు లక్ష పైనే ఉండగా, గేదెల రేట్లు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు చేరాయి. దీంతో రైతులపై ఆర్థిక భారం విపరీతంగా పెరిగింది. ఈ పెరిగిన ఖర్చులకు అనుగుణంగా పాల ధరను పెంచక తప్పడం లేదని రైతులు చెబుతున్నారు. ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పులు కూడా పాడి రైతుల దయనీయ పరిస్థితులకు కారణమయ్యాయి. ఎల్ నినోతో సకాలంలో వర్షాలు పడకపోవడం, తీవ్రమైన అనావృష్టితో దేశవ్యాప్తంగా పచ్చగడ్డి, పశుగ్రాసం, పంట దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. దానా తయారీకి ఉపయోగించే ముడి సరుకుల కొరత ఏర్పడటంతో ఫీడ్ ధరలు అసాధారణంగా పెరిగాయి. పశువులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించలేక రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. వాతావరణ వైపరీత్యాల కారణంగా పాడి పరిశ్రమ నిర్వహణ కష్టంగా మారుతోంది. ప్రభుత్వం నుంచి సరైన మద్దతు లేకపోవడం, పెరిగిన ఖర్చులకు తగినట్లుగా ప్రొక్యూర్మెంట్ ధరలు రాకపోవటంతో జీవనం సాగించటం కష్టమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వినియోగదారులు అధిక ధరలతో ఇబ్బంది పడుతుంటే, మరోవైపు రైతులు ఉత్పాదక ఖర్చుల భారాన్ని మోయలేక సతమతమవుతున్నారు. ఎల్ నినో పరిస్థితులతో ఏర్పడిన మేత కొరతను అధిగమించడానికి ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు ఆర్థిక సహాయం అందించాలని పాడి రైతులు కోరుతున్నారు. ఈ సంక్షోభం పాడి పరిశ్రమను తీవ్రంగా దెబ్బతీస్తోంది, దీనిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



విజయవాడ నుంచి 6 గంటల్లోనే బెంగళూరుకు..
కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేపై అప్డేట్ వచ్చేసింది..

బెంగళూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ముఖ్యంగా కొడికొండ సమీపంలోని చీన-44 ఇంటర్‌ఛేంజ్ ఈ ప్రాజెక్టులో కీలకంగా మారనుంది. 2027 నాటికి ఈ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఇది పూర్తయితే ఏపీకి ఆర్థికంగా ఉపయోగపడనుంది.



ఇకపై కేవలం 6 గంటల్లోనే బెంగళూరు-విజయవాడ మధ్య ప్రయాణించవచ్చు. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి 11 నుంచి 12 గంటల సమయం పడుతుంది. అయితే విజయవాడ-బెంగళూరు మధ్య గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది. ఆరు లైన్లుగా ఈ హైవే ఉండనుండగా.. భారత్ మాల పరియోజనా ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్నారు. దీని నిర్మాణానికి దాదాపు రూ.19,200 కోట్లు ఖర్చు పెడుతుండగా.. నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. ఏపీలో కోడికొండ వద్ద ప్రారంభం కానున్న ఈ ఎక్స్‌ప్రెస్ వే.. ప్రకాశం జిల్లాలోని అద్దంకి వద్ద ముగుస్తుంది. 2027 నాటికి పూర్తి చేసి దీనిని అందుబాటులోకి తీసుకురావాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా భావిస్తోంది. మొత్తం 14 ప్యాకేజీలుగా ఈ పనులు చేపడుతున్నారు. బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా దీని నిర్మాణం చేపడుతున్నారు. ఈ కొత్త హైవే పూర్తయితే కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ మధ్య అనుసంధానాన్ని మెరుగుపడనుంది. ఈ ప్రాజెక్ట్‌లో కొడికొండ సమీపంలోని చీన-44 ఇంటర్‌ఛేంజ్ ఒక ముఖ్యమైన ప్రాంతంగా చెప్పవచ్చు. ఇక్కడి సింగిల్ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ బెంగళూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వేను జాతీయ రహదారి 44 (చీన-44)తో కనెక్ట్ చేస్తుంది. కోడూరు పట్టణం దాటిన వెంటనే ఈ ఇంటర్‌ఛేంజ్ ఉంటుంది. బెంగళూరు నుండి కొడికొండ వరకు ఇప్పటికే హైవే ఉండగా.. కొడికొండ నుండి అద్దంకి వరకు కొత్త గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మిస్తున్నారు. అక్కడి నుండి విజయవాడ వరకు ఇప్పటికే ఉన్న ఆరు లేన్ల ద్వారా చేరుకోవచ్చు. దీని వల్ల బెంగళూరు- విజయవాడ మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గుతుంది. ప్రస్తుతం 643 కిలోమీటర్ల దూరం ఉంటుండగా.. ఈ కొత్త ప్రాజెక్టు పూర్తయితే కేవలం 518 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. దీని వల్ల ప్రయాణ సమయం కూడా బాగా ఆదా అవుతుంది. ఇక ఎక్స్‌ప్రెస్ వే పక్కన సర్వీస్ రోడ్ల నిర్మాణం కూడా చేపడుతున్నారు. ఆ ప్రాజెక్ట్ పనులపై 2026 జవవరిలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కర్ణాటకలోని దేవనహళ్లి నుంచి ఏపీలోని కోడికొండ వరకు 90 కిలోమీటర్ల మేర ఉన్న నేషనల్ హైవే (చీన-44)ను చీనూ× డీపీఆర్ సిద్ధం చేస్తోంది. త్వరలో దీనిపై కూడా ఒక స్పష్టత రానుంది. ఏపీ నుంచి బెంగళూరుకు ఉద్యోగాలు, వ్యాపారాల కోసం చాలామంది ప్రయాణిస్తుంటారు. ఈ హైవే పూర్తయితే వారందరికీ ఉపయోగం కలగనుంది. అలాగే పారిశ్రామిక అభవృద్ధికి కూడా ఉతం ఇవ్వనుంది. దీని వల్ల ఏపీకి ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చనుంది.

ఎన్నికల విధులకు వివిధ శాఖల
సిబ్బంది కేటాయింపు

అనంతపురం, అక్టోబరు 21, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు వివిధ ప్రభుత్వ శాఖల్లోని యూనిఫాం ధరించే సిబ్బందిని కేటాయించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఇతర ప్రాంతాల నుంచి కేంద్ర బలగాలు వచ్చే అవకాశం లేనందున, జిల్లాలో అందుబాటులో ఉన్న సిబ్బందితోనే భద్రతా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. అటవీ, అగ్నిమాపక, న్యాయ కొలతలు, అవినీతి నిరోధక శాఖ, జైళ్లు, ప్రత్యేక రక్షణ దళం, విద్యుత్తు, రవాణా, ఎక్సైజ్ తదితర శాఖల సిబ్బందిని ఎన్నికల విధులకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఎన్నికల రోజున అత్యవసర సేవలకు మాత్రమే పరిమిత సంఖ్యలో సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. ఆ రోజు నిర్వహించాల్సిన అవసరం లేని పనులను ఇతర రోజుల్లో చేపట్టాలన్నారు. ఎన్నికల విధులకు కేటాయించగల సిబ్బంది వివరాలను ఆయా శాఖల అధికారులు ముందుగానే జిల్లా ఎస్పీకి అందజేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద యూనిఫాం ధరించిన సిబ్బంది అందుబాటులో ఉండటం వల్ల ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జైళ్ల శాఖ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, అటవీ శాఖ రేంజ్ అధికారి శివరాం, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, న్యాయ కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

అనంతపురం, అక్టోబరు 21, అమరావతి వెలుగు : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం మెరుగుపరచడంతోపాటు రోగులకు మందులు, తాగునీటి కొరత లేకుండా చూడాలని సూచించారు. అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో బుధవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పేద రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారని, వైద్యులు అందుబాటులో ఉంటూ వారికి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. అత్యవసర కేసుల్లో మానవతా దృక్పథంతో తక్షణమే చికిత్స అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి పరిసరాల్లో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, చెత్తకుండీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. రోగులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. ప్రభుత్వ సరఫరా మందుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రోగులకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు 24 గంటలూ పనిచేసేలా పర్యవేక్షించాలన్నారు. భద్రతా సిబ్బందిని అవసరమైన చోట నియమించాలని, ముఖ్యంగా మార్చురీ వద్ద భద్రతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ఆపరేషన్ థియేటర్లలో లైటింగ్, ఏసీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విద్యుత్తు సరఫరా నిలిచినప్పుడు జనరేటర్ పనిచేసేలా చూడాలన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సుమారు రెండు వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, అందరూ సమన్వయంతో విధులు నిర్వహించి ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. గత సమావేశంలో చర్చించిన అంశాల అమలుపై సమీక్షించడంతోపాటు పలు విషయాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పరిపాలనాధికారి, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జీజీహెచ్ సూపరింటెండెంట్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి రూరల్‌లో వైసీపీ అభ్యర్థులకు మద్దతుగా
డా.బత్తల హరిప్రసాద్ ఎన్నికల ప్రచారం

కదిరి, అక్టోబరు 21, అమరావతి వెలుగు : కదిరి రూరల్ మండలంలో వైఎస్సార్‌సీపీ తరఫున జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) సభ్యుడు, రాయదుర్గం నియోజకవర్గ పరిశీలకుడు డా. బత్తల హరిప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ అభ్యర్థి రోహిణి, ఎంపీటీసీ అభ్యర్థి డా. బత్తల శాంతమ్మకు మద్దతుగా ప్రచారం చేస్తూ, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వారిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కదిరి రూరల్ మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణికంఠ నాయక్, రాజు నాయక్, ఆది, అంజి, కుమ్మర బాబు, జ్యోతి, జ్యోతి కుమార్, నగేష్, తిరుపాలు నాయక్, శ్రీకాంత్, కిరణ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు

కొత్తచెరువు, అక్టోబరు21, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజు ప్రశాంతంగా కొనసాగింది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు కొత్తచెరువులోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రంలోకి ప్రవేశించే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం అనుమతించారు. పుట్టపర్తి డీఎస్పీ మాణిక్యరావు పర్యవేక్షణలో సీఐలు రాజశేఖర్, యువరాజ్‌తో పాటు పోలీసు సిబ్బంది భద్రతా విధులు నిర్వహించారు. కేంద్రం పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద నిబంధనలకు సహకరించాలని, అనుమతి ఉన్నవారు మాత్రమే లోపలికి ప్రవేశించాలని తెలిపారు. అనవసరంగా గుమిగూడటం, వాగ్వాదాలు, ఘర్షణలకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో బెదిరింపులకు పాల్పడినా, రాజకీయ ఘర్షణలకు కారణమైనా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిగా
విధుల్లో పునరంకితం కావాలి

అనంతపురం , అక్టోబరు 21, అమరావతి వెలుగు : పోలీసు అమరవీరుల త్యాగాలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పునరంకితం కావాలని అనంతపురం రేంజ్ ఐజీపీ డాక్టర్ షెముషి, జిల్లా ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఐజీపీ డాక్టర్ షెముషి, ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సుయష్ కుమార్ తదితరులు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. స్మృతి పరేడ్ నిర్వహించి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసులు ప్రజల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, వారి సేవలకు ప్రజల సహకారం అవసరమని ఐజీపీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళల భద్రత, నేరాల కట్టడి, సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు. 2025--26లో దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 154 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కలెక్టర్ ఓ.ఆనంద్ భరోసా ఇచ్చారు. అనంతరం పోలీసు, హోంగార్డు కుటుంబాలకు మొత్తం రూ. 1.50 లక్షల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.











ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ..
జిల్లా అదనపు ఎస్పీకి ఉషా చరణ్ ఫిర్యాదు

పుట్టపర్తి, అక్టోబరు 21, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గ పరిధిలోని కురబవాండ్లపల్లి, మునిమడుగు ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న ఘటనలపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషా చరణ్ బుధవారం జిల్లా అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నామినేషన్ల ప్రక్రియకు ఆటంకం కలగకుండా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే చర్యలకు తావులేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న అభ్యర్థులను అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను లాక్కున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా ప్రతి అభ్యర్థికి తగిన భద్రత కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిబంధనలకు విరుద్ధంగా పరిస్థితులు తలెత్తడం మంచిది కాదనే ఉద్దేశంతోనే మంత్రి సవితమ్మ దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్తున్నట్లు ఉషా చరణ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేందుకు అన్ని వర్గాలు సహకరించాలని సూచించారు. సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ప్రశాంతమైన ఎన్నికల వాతావరణాన్ని కొనసాగించేందుకు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కోరినట్లు తెలిపారు.



రంగస్వామి నగర్‌లో ఎమ్మెల్సీ శ్రీమతి
వడ్డే దళవాయి రమాదేవి ప్రచారం

అనంతపురం అర్బన్, అక్టోబరు 21, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనంతపురం అర్బన్ 58వ డివిజన్ పరిధిలోని రంగస్వామి నగర్‌లో కూటమి అభ్యర్థుల తరఫున ఎమ్మెల్సీ శ్రీమతి వడ్డే దళవాయి రమాదేవి విస్తృత ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ వడ్డే దళవాయి రమాదేవి, కూటమి ప్రభుత్వం నిర్ణయించిన మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్, 58వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి దళవాయి నాగ రత్నతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






23న అనంతపురంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు

అనంతపురం, అక్టోబరు 21, అమరావతి వెలుగు : ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ నెల 23న అనంతపురంలో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్--2026 ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ సదస్సుకు నగరంలోని జేఎన్‌టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఈ ప్రాంతీయ సదస్సులో ఏరోస్పేస్, రక్షణ రంగం, ఆటోమొబైల్, సహజ వ్యవసాయం, ఉద్యానవన పంటలు, ఆహార శుద్ధి, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వారి ప్రతినిధులు, విధాన రూపకర్తలు పాల్గొని రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించనున్నారు.

సదస్సు షెడ్యూల్ ఇలా.. ఈ నెల 23న ఉదయం 10.30 గంటలకు ఏపీ పెవిలియన్, ఎంఎస్ఎంఈ, సాంకేతికత, ఉత్పత్తుల ప్రదర్శనలు ప్రారంభమవుతాయి. ఉదయం 11.15 గంటలకు ప్రారంభోత్సవం, స్వాగత ప్రసంగం, ప్రారంభ సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పెట్టుబడి భాగస్వామ్యాలకు సంబంధించి



అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపడతారు. అనంతరం 1.30 గంటలకు భోజనం, పారిశ్రామికవేత్తల పరస్పర పరిచయ కార్యక్రమం నిర్వహిస్తారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ సదస్సులు... రాష్ట్రంలో అక్టోబరు 7 నుంచి 26 వరకు వివిధ ప్రాంతాల్లో రంగాల వారీగా ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విశాఖపట్నం, కాకినాడ, గుంటూరులో సదస్సులు జరగ్గా, ఈ నెల 23న అనంతపురంలో నిర్వహించనున్నారు. ఈ నెల 26న తిరుపతిలో మరో ప్రాంతీయ సదస్సు జరగనుంది. ఆయా రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడంతోపాటు కీలక ప్రాజెక్టులకు సంబంధించి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

ఏర్పాట్లపై అధికారుల పర్యవేక్షణ.. సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, అతిథి గృహంలో ఏర్పాట్లను పలుమార్లు పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జడ్పీటీసీ స్థానాలకు 19 నామినేషన్లు..

కొత్తచెరువు, అక్టోబరు 21, అమరావతి తెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో జడ్పీటీసీ స్థానాలకు మొత్తం 19 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కొత్తచెరువులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగగా.. వివిధ మండలాల నుంచి అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో కొంతమంది అభ్యర్థుల పేర్లు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీల వివరాలను ఫొటోలతో సహా ప్రచురిస్తున్నాం.

మండలాల వారీగా నామినేషన్ల వివరాలు:
- బత్తలపల్లి - 2 - సీకేపల్లి - 1
- ధర్మవరం - 2 - గాండ్లపెంట - 2
- కదిరి - 2 - ముదిగుబ్బ - 1 - ఎన్.పి. కుంట - 2
- రొళ్ల - 1 - సోమందేపల్లి - 1
- తాడిమర్రి - 4 -తలుపుల -1

మొత్తం పది మండలాల నుంచి 19 నామినేషన్లు దాఖలయ్యాయి.



జడ్పీటీసీ నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన...

ఎన్నికల పరిశీలకులు

కొత్తచెరువు, అక్టోబరు 21, అమరావతి తెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు పి. అరుణ్‌బాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మంగళవారం సంయుక్తంగా తనిఖీ చేశారు. కొత్తచెరువులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి డీవీస్పీ సి. మాణిక్యరావు నామినేషన్ కేంద్రం వద్ద ఉండి భద్రతా ఏర్పాట్లను, పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని, నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లను స్వీకరించాలని స్పష్టం చేశారు.





నామినేషన్ల ప్రక్రియలో ఇబ్బందులు

తలెత్తకుండా చూడాలి

రాప్తాడు, అక్టోబరు 21, అమరావతి తెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ బుధవారం రాప్తాడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలించారు. ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటన, నోటీసు బోర్డు ఏర్పాటు, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు, ఫిర్యాదులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. దాఖలైన నామినేషన్లను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. నామినేషన్ల చివరి రోజు చివరి సమయంలో అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏడీఏ, ఎన్నికల అధికారి రవి, తహసీల్దార్ చెన్నకేశవులు, ఎన్నికల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే

కఠిన చర్యలు

అనంతపురం , అక్టోబరు 21, అమరావతి తెలుగు : మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, పక్షపాత ధోరణితో వ్యవహరించినా, నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ హెచ్చరించారు. అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం మున్సిపల్ సాధారణ ఎన్నికలు--2026 నిర్వహణపై పీఓ, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల్లో సమయపాలన పాటించాలని, హ్యాండ్‌బుక్‌లోని నిబంధనలను పూర్తిగా అధ్యయనం చేసి, వాటి ప్రకారమే విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు, సీలింగ్ ప్రక్రియ వరకు ప్రతి అంశానికి ప్రిసైడింగ్ అధికారులే బాధ్యత వహించాలన్నారు. నిజమైన అనారోగ్య, అత్యవసర పరిస్థితుల్లోనే ఎన్నికల విధుల నుంచి మినహాయింపును పరిశీలిస్తామని స్పష్టం చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని, వారు తమ ఓటు నమోదైన మున్సిపాలిటీలోనే ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌లో కౌంటింగ్ కేంద్రాల వద్ద పోస్టల్ బ్యాలెట్ సదుపాయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మాస్టర్ ట్రైనర్, విశ్రాంత ఎస్‌డీసీ గోవిందరాజులు ఎన్నికల విధివిధానాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ ఆనంద్, జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ భార్గవ్, డీఈఓ అయూబ్ హుస్సేన్, నగరపాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.



వైస్సార్సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా

పైపల్లి నరసింహులు

శ్రీ సత్యసాయి జిల్లా, అక్టోబరు 21, అమరావతి తెలుగు : వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగమైన ఎస్సీ సెల్ శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బుధవారం నియమితులైన పైపల్లి నరసింహులు తన నియామకానికి సహకరించిన పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి కేటాయించిన పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీకి విధేయుడిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా శక్తివంచన లేకుండా పనిచేస్తానని పైపల్లి నరసింహులు తెలిపారు.



నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన

కలెక్టర్, జాయింట్ కలెక్టర్

కొత్తచెర్వు, అక్టోబరు 21, అమరావతి తెలుగు : కొత్తచెర్వు మండల కేంద్రంలో జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ, లైటింగ్, మైక్ తదితర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. స్వీకరించిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి భద్రపరచాలన్నారు. కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు బందోబస్తు పటిష్ఠం చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.







శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో ఆచరించాలి

పుట్టపర్తి , అక్టోబరు 21, అమరావతి తెలుగు : శిక్షణలో నేర్చుకునే ప్రతి అంశాన్ని విధి నిర్వహణలో వినియోగించుకుంటూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సూచించారు. పుట్టపర్తిలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై తొలి విడత శిక్షణను ప్రారంభించారు. మొదటి బ్యాచ్‌లో 305 మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. శిక్షణలో సాంకేతిక, పరిపాలనా అంశాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, రెవెన్యూ సేవలను ప్రజల గుమ్మం వద్దకు సమర్థవంతంగా తీసుకెళ్లడంలో శిక్షణ పొందిన సిబ్బంది కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

పుట్టపర్తి, అక్టోబరు 21, అమరావతి తెలుగు : దేశ రక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, హిందూపురం అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు, పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పస్పుల హాజరయ్యారు. పరేడ్ కమాండర్ ఉమామహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పరేడ్‌లో గౌరవ వందనం సమర్పించారు. అనంతరం అమరవీరుల స్మారక స్థూపం వద్ద కలెక్టర్, న్యాయమూర్తులు, ఎస్పీ, అదనపు ఎస్పీ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో సైనికులు రక్షణ కల్పిస్తే, అంతర్గతంగా పోలీసులు శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నారని తెలిపారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలు కుటుంబాలతో ఆనందంగా గడుపుతున్న సమయంలోనూ పోలీసులు విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అమరవీరుల కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని కోరారు. తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, మహిళల భద్రతకు సంబంధించిన అంశాల్లో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయని పేర్కొన్నారు. పోలీసుల కృషిని అభినందించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న లడఖ్‌లో చైనా దళాలతో జరిగిన ఘర్షణలో పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణం పొందారని గుర్తుచేశారు. వారి త్యాగాలకు గుర్తుగా ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు పోలీసులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు పోలీసు సంక్షేమ నిధి ద్వారా సహాయం అందిస్తున్నామని, పోలీసు శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అమరవీరుల సేవలను ప్రజలకు తెలియజేసేందుకు అక్టోబరు 21 నుంచి 31వ తేదీ వరకు సంస్మరణ వారోత్సవాలు నిర్వహించి వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అంకిత సురానా, అర్డీవో సువర్ణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ మాణిక్యరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

















పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా మేకల ఈశ్వర్

పుట్టపర్తి, అక్టోబరు 21, అమరావతి తెలుగు : పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ పదవికి జనసేన పార్టీ అభ్యర్థిగా మేకల ఈశ్వర్‌ను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో బుధవారం పుట్టపర్తిలో ఆయనకు సంబంధించిన జనసేన పార్టీ బీ-ఫామ్‌ను అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కదిరికి చెందిన జనసేన నాయకుడు, బ్లూ మూన్ సంస్థల అధినేత మంచి శివశంకర్, మల్లెం మోహన్ (రాము), కొమ్మినేని చిన్నపరెడ్డి, తమ్మిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు. పుట్టపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ పూల శివప్రసాద్ హాజరై సంఘీభావం తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పుట్టపర్తి అభివృద్ధికి కృషి చేసేందుకు మేకల ఈశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు.



Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576